సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం। 10। ఆగస్టు। 2024



టీడీపీ నేత భూ కబ్జా

అధికారాన్ని అండగా పెట్టుకుని టీడీపీకి చెందిన మాజీ ఎంపీపీ దన్నేరావు ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తున్నారు. 8లో



రక్తదాతలుగా మారండి

ప్రతిఒక్కరు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కలెక్టర్ దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. 8లో




'సోలార్' పోస్టర్ ఆవిష్కరణ

పీఎం జన్‌మన్ యోజన సోలార్ పోస్టర్‌ను చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, ఈపీడీసీఎల్ ఎస్ఈ ఆవిష్కరించారు. 8లో

న్యూస్‌రీల్

గంజాయి మొక్కల కలకలం

- తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏపుగా పెరుగుదల
- పట్టించుకోని ఉద్యోగులు, సిబ్బంది



తహసీల్దార్ కార్యాలయ అవరణలో ఏపుగా పెరిగిన గంజాయి మొక్కలు

అరకులోయ రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సుమారు 15 గంజాయి మొక్కలు వెలుగుచూడటం కలకలం సృష్టించింది. వీటి విత్తనాలు ఇక్కడికి ఎలా వచ్చాయో తెలియదు గాని ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఇవి మొలకెత్తాయి. సుమారు నాలుగు అడుగుల మేర ఏపుగా పెరిగాయి. ఈ కార్యాలయానికి వస్తున్న వారు వీటిని చూసి ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఎక్కడైనా చిన్న గంజాయి మొక్క కనిపిస్తే పీకి పారేసే పరిస్థితుల్లో వనం మాదిరిగా కనిపిస్తున్న వీటిని కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

గర్భిణులకు వైద్య పరీక్షలు



పీహెచ్‌సీలో గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యులు

వై.రామవరం: మండలంలోని చవిటిదిబ్బలు పీహెచ్‌సీలో శుక్రవారం 76 మంది గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ దినేష్, వైద్యాధికారి డాక్టర్ నరేంద్ర ఆధ్వర్యంలో రక్తపరీక్షలు నిర్వహించిన అనంతరం మందులు పంపిణీ చేశారు. వారిలో 35 మంది హైరిస్క్ గర్భిణులనుఉ గుర్తించి ఆస్పత్రిలో చేర్పించారు. గర్భిణులందరికీ ఉచిత భోజన వసతి, రవాణా సౌకర్యం కల్పించారు.

323 గ్రామాల ప్రజలకు ఇబ్బంది



నా పేరు పాంగి సుబ్బారావు. మాది చింతపల్లి మండలం గొందిపాకల పంచాయతీ తాటిబంద. మా గ్రామంతో పాటు తోటమామిడి, గొడుగుమామిడి, రోలుగుంట గ్రామాల్లో సుమారు 350 రేషన్ కార్డు దారులు ఉన్నారు. **2019కు ముందు తమ** గ్రామానికి ఎటువంటి రో**డ్డు సౌకర్యం** లేనందున రేషన్ కోసం గె**డ్డలు, వాగులు** దాటుకుంటూ చాలా ఇబ్బ**ందులు ఎదు**ర్కొనేవాళ్లం. గత వైఎస్సా**ర్‌సీపీ ప్రభుత్వం** అధికారంలోకి వచ్చాక రో**డ్డు నిర్మించారు.** దీంతో ఇంటి ముంగిటికే **రేషన్ వాహనం** వచ్చి సరుకులు ఇచ్చేది. **ఈ వ్యవస్థను రద్దు** చేస్తున్నట్టు సీఎం చంద్ర**బాబు ప్రకటిం**చడం సరికాదు. ఎండీయూ **వాహనం** రాకుంటే సుమారు ఎని**మిది కిలోమీటర్ల** దూరంలోని నమ్మగిరి రేషన్ డిపోకు కాలి నడకన వెళ్లి తెచ్చుకోవాలి. ఇలా మా మండలంలోని 17 పంచాయతీల పరిధిలో పంచాయతీ కేంద్రాలు మినహా 323 గ్రామాల ప్రజలు తమలాగ ఇబ్బందులు పడాల్సిందేనని సుబ్బారావు వాపోయాడు.

దేశం మెచ్చిన ఎండీయూ వ్యవస్థను రద్దు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్ల సమావేశంలో ప్రకటించడంతో గిరిజనులకు మళ్లీ రేషన్ కష్టాలు మొదలు కానున్నాయి. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రత్యేక వాహనాల ద్వారా ఇంటివద్దకే రేషన్ సరఫరా ఎంతో సౌకర్యవంతంగా ఉండేది.ఐదేళ్లూ ఏ కష్టం లేకుండా ఏజెన్సీ వాసులకు రేషన్ అందేది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం మళ్లీ పాత కష్టాలను తెచ్చి పెడుతోంది. ఈ నిర్ణయాన్ని జిల్లా వాసులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

రేషన్ బండి.. ఇక రాదండి



ఇంటింటికీ రేషన్ సరఫరా వ్యవస్థ లేనప్పుడు రేషన్ బస్తాలను మోసుకువెళ్తున్న మారుమూల గ్రామ గిరిజనులు

- ఎండీయూ వ్యవస్థకు మంగళం పాడుతున్న కూటమి ప్రభుత్వం
- జిల్లావాసులకు మళ్లీ ఆనాటి కష్టాలే
- కిలోమీటర్ల కొద్దీ కాలినడకన వెళ్తేనే సరకులు దక్కేది
- సీఎం చంద్రబాబు ప్రకటనపై సర్వత్రా నిరసన
- 2,98,092 కార్డుదారులకు తప్పని అవస్థలు
- ఉపాధి కోల్పోనున్న ఆపరేటర్లు, హెల్పర్లు

పాడేరు: జిల్లాలో గ్రామాల పరిస్థితి మైదాన ప్రాంతాలతో పోలిస్తే చాలా భిన్నంగా ఉంటుంది. ప్రతీ పంచాయతీలో సుమారు 12కు పైగా శివారు గ్రామాలు ఉంటాయి. ఇవి కూడా ఐదు నుంచి పది కిలోమీటర్ల దూరంలో విసిరిపారేసినట్టుగా ఉన్నందున పంచాయతీ కేంద్రంలోని రేషన్ డిపోకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాలంటే అష్టకష్టాలు పడాల్సిందే. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎండీయూ వ్యవస్థ వీరికి ఎంతో సౌకర్యవంతంగా ఉండేది.

మంత్రి అలా.. సీఎం ఇలా..

జిల్లాలోని 22 మండలాల్లోని 430 పంచాయతీల పరిధిలో 5,108 గ్రామాలు ఉన్నాయి. వీటి పరిధిలో 2,98,092 మంది రేషన్ కార్డుదారులు ఉన్నారు. వీరికి 221 వాహనాల ద్వారా గత ప్రభుత్వం ఇంటి వద్దకే రేషన్ అందించేది. సుమారు 221 ఎండీయూ ఆపరేటర్లతోపాటు మరో 221 మంది హెల్పర్లకు ఉపాధి దొరికేది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆదిలోనే జూన్ 25న గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తొలుత గిరిజన ప్రాంతాల్లో ఇంటింటికి రేషన్ వ్యవస్థ రద్దు చేస్తామని, వాటి స్థానంలో జిల్లాలో 960 రేషన్ దుకాణాలను పునరుద్ధరిస్తామని ప్రకటించారు. దీంతో ఎండీయూ ఆపరేటర్లు, గిరిజనుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఎండీయూ ఆపరేటర్ల యూనియన్ నాయకులు అదే నెల 28న ఆమె వద్దకు వెళ్లి తమ మొర వినిపించారు. స్పందించిన మంత్రి ఎండీయూ వ్యవస్థను కొనసాగిస్తామని, ఎండీయూ వాహనాలతోనే ఇంటింటికి రేషన్ పంపిణీ చేస్తామని ఆనాడు ప్రకటించారు. మరలా ఉన్నట్టుండి ఇంటింటికి రేషన్ వ్యవస్థ రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ల సమావేశంలో సాక్షాత్తూ సీఎం చంద్రబాబు ప్రకటించడాన్ని జిల్లావ్యాప్తంగా ప్రజలు వ్యతిరేకిస్తున్నారు.

మళ్లీ నడకయాతన

- పాడేరు మండలంలోని మోదాపల్లి, గుర్రగరువు, సల్దిగెడ్డ గ్రామాల గిరిజనులు మూడు కిలోమీటర్ల దూరంలో మినుములూరు డిపోకు వెళ్లాలి.
- పాడేరు మండలం మారుమూల కించూరు పంచాయతీ వంటివీధుల, గొడ్డలిపాడు, బొంజంగి, గడ్డిబందలు గ్రామాలు ఐదు కిలోమీటర్ల దూరంలో కించూరు డిపోకు, బర్లుపుట్టు, ఉరుగొండ, దొనెల, బొడ్డాపుట్టు, బరెడుపుట్టు గ్రామాల రేషన్‌కార్డుదారులు నాలుగు కిలోమీటర్ల దూరంలోని బంగ్రోత్‌పుట్టు రేషన్ డిపోకు వెళ్లి తెచ్చుకోవాలి.
- పాడేరు మండలం ఐనాడ, సలుగు, దేవాపురం పంచాయతీలోని 20 గ్రామాల గిరిజనులు ఆరు కిలోమీటర్ల దూరంలో రేషన్ డిపోలకు వెళ్లాల్సి తెచ్చుకోవాల్సి ఉంటుంది.
- చింతపల్లి మండలంలో 17 పంచాయతీల పరిధిలో 340 గ్రామాలు ఉన్నాయి. వీటిలో పంచాయతీ కేంద్రాలు మినహా మిగతా అన్ని గ్రామాలు రేషన్ కోసం కిలోమీటర్ల కొద్దీ కాలి నడకన డిపోలకు వెళ్లి తెచ్చుకోవాల్సిందే.
- నాలుగు కిలోమీటర్ల దూరంలో మంప డిపోకు వెళ్లి రేషన్ తెచ్చుకోవాలని కొయ్యూరు మండలం పైడిపనుకులు, దుక్కులబంద, గంగవరం, శాంతినగరం గ్రామాల గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- **జీకే వీధి మండలం చిన అ**గ్రహారం, పెద అగ్రహా**రం, వాడమామిడి, చీడిగొ**ంది, గ్రామాల గిరిజ**నులు నాలుగు కిలోమీటర్ల** దూరంలో కుంకుపూడి **డిపో నుంచి రేషన్ తెచ్చుకో**వాల్సి ఉంది.
- **అరకువేలి మండలం ఎం.** అట్టగూడ, బోడుగుడ, **దళపతి, డింగ్రిపుట్టు, నంది**గూడ, హట్టగూడ తది**తర గ్రామాల గిరిజనులు** ఎనిమిది కిలోమీటర్ల **దూరంలో మాడగడ డీఆర్** డిపోకు వెళ్లి అష్టకష్టాలు పడి రేషన్ తీసుకోవాలి.
- పెదబయలు మండలం కించూరు, జంగంపుట్టు, పెదవంచరంగి. చినవంచరంగి, సంగవలస, చీమకొండ తదితర గ్రామాల గిరిజనులు ఐదు కిలోమీటర్ల దూరంలో రాయిమామిడి డీఆర్ డిపోకు వెళ్లి రేషన్ తెచ్చుకోవాలి.
- పెదబయలు మండలం మారుమూల బొంగరం డీఆర్ డిపో పరిధిలోని నిట్టాపుట్టు, జంగలవీధి, అగరవీధి, దేవరాజుమెరకలు, చదురుమామిడి, వేలంగరువు, వెదురుగొయ్యి, కుంటుమామిడి తదితర గ్రామాల గిరిజనులు రేషన్ డిపోకు ఐదు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సిందే.
- డుంబ్రిగుడ మండలం తోటవలస, బొడుగుడ, పంతలిచింత, అంత్రేగూడ, పెదపాడు, చంపాపట్టి, పనసపుట్టు, కోసంగి, లివిటిపుట్టు, కొత్తవలస తదితర గ్రామాల గిరిజనులు పది కిలోమీటర్ల దూరంలోని డుంబ్రిగుడ రేషన్ డిపోకు వెళ్లి తెచ్చుకోవాలి.
- అనంతగిరి మండలం తాటిగూడ, తలారిపాడు, పూలుగూడ, తేనెపట్టు, పాతకోట, రేగం, డెక్కాపురం, బరజోల తదితర గ్రామాల గిరిజనులు పది కిలోమీటర్ల దూరంలో అనంతగిరి వెళ్లి రేషన్ తీసుకోవాలి.
- హుకుంపేట మండలం కిన్నెరలోవ, పనసబంద, ఓలుబెడ్డ, నిమ్మలగొంది. కరకపుట్టు, గాలిపాడు, అంబవాడ తదితర గ్రామాల గిరిజనులు పది కిలోమీటర్ల దూరంలో తీగలవలస డీఆర్ డిపోకు వెళ్లాలి.
- రంపచోడవరం మండలం గెద్దాడ పంచాయతీ పరిధిలోని చెరువుపాలెం గ్రామానికి చెందిన గిరిజనులు ఆరు కిలోమీటర్ల దూరంలో పెద్దగెడ్డలో రేషన్ షాపుకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాలి.
- రంపచోడవరం మండలం సోకులగూడెం, దబ్బవలస, గ్రామాల గిరిజనులు సుమారు ఏడు కిలోమీటర్లు ప్రయాణం చేస్తేనే రేషన్ దక్కేది.
- చింతూరు మండలం చౌలూరుకు చెందిన రేషన్ కార్డుదారులు ఐదు కిలోమీటర్ల దూరం ప్రయాణించి కంసులూరు గెడ్డ దాటి రేషన్ తెచ్చుకోవాలి. ఇక వర్షాకాలంలో వీరికి రేషన్ సరుకులు అందని పరిస్థితి.
- కూనవరం మండలం గండికొత్తగూడెంకు చెందిన రేషన్‌కార్డుదారులు ఐదు కిలోమీటర్ల దూరంలో పెదర్కూరు గ్రామానికి వచ్చి రేషన్ సరుకులు తీసుకోవాలి.
- వీఆర్‌పురం మండలం చొక్కనపల్లి గ్రామానికి రేషన్‌కార్డుదారులు నాలుగు కిలోమీటర్ల దూరంలో శ్రీరామగిరికి వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవాలి.
- ఎటపాక మండలం ఎర్రగట్టుకు చెందిన రేషన్‌కార్డుదారుల కష్టాలు వర్ణనాతీతం. వీరైతే ఏకంగా 15 కిలోమీటర్లు కాలినడక ప్రయాణించి వినాయకపురం రేషన్ డిపోకు వచ్చి సరుకులు తీసుకుని వెళ్లాలి. రేషన్ సరుకుల కోసం వచ్చి వెళ్లేందుకు ఒక రోజు కేటాయించాల్సిందే.



ఎండీయూ వాహనం ద్వారా ఇంటి వద్దే రేషన్ తీసుకుంటున్న లబ్ధిదారులు



ఎండీయూ వ్యవస్థ లేకముందు రేషన్‌ను మోసుకు వెళ్తున్న ఉబ్బెంగుల గిరిజనులు



రేషన్ వాహనాలు లేనప్పుడు గెడ్డ దాటి డిపో నుంచి సరుకులు తెచ్చుకుంటున్న బలపం గిరిజనులు

ఎండీయూ వ్యవస్థ రద్దు సరికాదు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రేషన్ వ్యవస్థలో తీసుకువచ్చిన మార్పు కారణంగా ఐదేళ్ల నుంచి ఇంటి వద్దే రేషన్ అందుతోంది. ప్రతి నెలా ఎండీయూ ఆపరేటర్ సమయానికి వచ్చి మా గ్రామంలో అందరికి రేషన్ ఇచ్చి వెళ్తారు. రేషన్ వ్యవస్థ ఎంతో సౌకర్యంగా ఉంది. ఎండీయూ వ్యవస్థ వల్ల తమకు ఎటువంటి ఇబ్బందులు లేవు. ఇప్పుడు ఈ వ్యవస్థను రద్దు చేస్తామని చెప్పడం అన్యాయం. మళ్లీ రేషన్ షాపులకు వెళ్లి తీసుకోవాలంటే అధిక సమయం పడుతుంది. ప్రభుత్వం రేషన్ సరకులను ఇంటింటికీ అందించాలి.

– డి.కుమారి, రాజేంద్రపాలెం, కొయ్యూరు మండలం

ఉపాధి కోల్పోతాం



విద్యార్హతలు ఉండి ఏ ఉద్యోగం, ఉపాధి లేకుండా ఊర్లోనే ఖాళీగా ఉన్న నాకు ఎండీయూ ఆపరేటర్‌గా అవకాశం వచ్చింది. ప్రతి నెలా క్రమం తప్పకుండా పదో తేదీలోపే నా పరిధిలో ప్రతి గ్రామానికి వెళ్లి రేషన్ సరుకులు అందించేవాడిని. ఎండీయూ ఆపరేటర్‌గా నాకు, నాతో పని చేసే హెల్పర్‌కు ఉపాధి దొరికింది. ఎండీయూ వాహనం ద్వారా వచ్చే డబ్బుతోనే ప్రతి నెల కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాను. ఎండీయూ వ్యవస్థ రద్దు చేస్తామనడం బాధిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి ఇంటింటికీ పంపిణీ కొనసాగించాలి.

– లింగేటి సత్తిబాబు, ఎండీయూ ఆపరేటర్, రాజేంద్రపాలెం, కొయ్యూరు మండలం

గిరిజన ప్రాంతంలో అమలుచేయాలి



ఎండీయూ వ్యవస్థ వల్ల ప్రజలకు ఏ నష్టం లేదు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ఎంతో మేలు జరుగుతోంది. రేషన్‌కార్డుదారుల వద్దకే వెళ్లి సరుకులు ఇస్తుండటంతో వారికి వ్యయప్రయాసలు తగ్గాయి. ఎండీయూ వ్యవస్థ ద్వారా వాహనం నడుపుకుంటూ రేషన్ ఇస్తూ ఉపాధి పొందుతున్నాం. ఈ వ్యవస్థ రద్దు చేస్తే ఉపాధి కోల్పోవడమే కాకుండా కుటుంబ పోషణ కష్టంగా మారుతుంది. ఇంటింటికీ రేషన్ పంపిణీ విధానం కనీసం మాలాంటి గిరిజన ప్రాంతాల్లో అమలుచేసేలా ప్రభుత్వం ఆలోచన చేయాలి.

– కూడా రవి, ఎండీయూ ఆపరేటర్, చింతపల్లి

రాజకీయ కక్షతోనే విధ్వంసాలు

- అంబేడ్కర్ న్యాయ మహాశిల్పంపై దాడి పిరికిబంద చర్య
- అరకు ఎంపీ తనూజరాణి ధ్వజం



అరకులోయ రూరల్: అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పంపై రాజకీయ కక్షలోనే దాడికి పాల్పడ్డారని అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణి విమర్శించారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకరులతో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, తుగ్లక్ పాలనను తలపిస్తోందన్నారు. గత ప్రభుత్వాలు చేయని విధంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజల ఆరాధ్యదైవంగా భావిస్తున్న భారత నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటును చూసి ఓర్వలేక రాత్రి వేళల్లో దానిని ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక దొంగదారిలో దాడికి యత్నించడం పిరికిబంద చర్యగా ఆమె పేర్కొన్నారు. రాష్ట్రంలో గత టీడీపీ ప్రభుత్వ పాలనలో చేసిన అభివృద్ధి ఏమీలేదన్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమమే కనిపిస్తుందన్నారు. వీటికి సంబంధించి శిలాఫలకాలను చూసి ఓర్వలేక దుశ్చర్యలకు పాల్పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజ లు బుద్ధిచెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.

రాష్ట్రంలో 'కూటమి' అరాచక పాలన



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి, పార్టీ శ్రేణులు



రంపచోడవరంలో నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే , పార్టీ నేతలు, కార్యకర్తలు

- రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ధ్వజం
- అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ నేతలు శిలాఫలకాన్ని ధ్వంసం చేయడంపై నిరసన

రంపచోడవరం: టీడీపీ కూటమి రాష్ట్రంలో అరాచకపాలన సాగిస్తోందని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగుపల్లి ధనలక్ష్మి ధ్వజమెత్తారు. విజయవాడలో తమ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం వద్ద శిలాఫలకాన్ని టీడీపీ నేతలు, కార్యకర్తలు నాశనం చేయడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. ఇందుకు నిరసనగా స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి పాలనలో రాష్ట్రంలో అసాంఘిక కార్యకలాపాలు, దాడులు, నేరాలు విపరీతంగా పెరిగాయన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగుతున్నా రాష్ట్ర హోం మంత్రి, ప్రభుత్వం ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ సీపీ జెండా పట్టుకున్న వారిని ఎంత దారుణంగా నడిరోడ్డు చంపుతున్నారో మనం చూస్తున్నామన్నారు. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా, అడవిలో ఉన్నామని ఆమె ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు శాంతిభద్రతల సమస్య రాలేదన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా పక్కదారి పట్టిస్తూ, దాడులతో రాష్ట్రంలో భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని ఆరోపించారు. లోకేష్ ఎవరిపై ఎక్కువ కేసులు ఉంటే వారికి నామినేటెట్ పదవులు అంటూ ప్రకటించిన తీరు దారుణమన్నారు. దీంతో టీడీపీ నాయకుల, కార్యకర్తలు పేట్రేగిపోతున్నారని.. పోలీసుల ఎదుటే హత్యలు చేస్తున్నారని ఆరోపించారు. పాలనలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బంధం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, వైస్ఎంపీపీ పండా కుమారి, ఎంపీటీసీలు కుంజం వంశీ, ఉలవల లక్ష్మి, వలీ సర్పంచ్ మంగా బొజ్జియ్య, పార్టీ నాయకులు రామకృష్ణదొర, రామన్నదొర, రాపాక సుదీర్,బొబ్బా శేఖర్, నాగేశ్వరరావు, రూతూ, మంగా తమన్నకుమార్, దూడ స్మిత్, వేము, రామారావు పాల్గొన్నారు.

ఆదివాసీలు నిజమైన మానవతావాదులు

- వారి సంక్షేమానికి ప్రత్యేక చర్యలు
- విద్యార్థులతో చైతన్యం నింపేందుకు 'మార్గదర్శి'
- కలెక్టర్ దినేష్‌కుమార్
- తలారిసింగిలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



విల్లంబులను ఎక్కి పెట్టిన కలెక్టర్ దినేష్‌కుమార్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



అంతర్జాతీయ ఉత్తమ కాఫీ రైతు అవార్డు గ్రహీత అశ్వినికి సత్కారం

సాక్షి,పాడేరు: ప్రకృతిలో పర్యావరణాన్ని కాపాడే ఆదివాసీలే నిజమైన మానవతావాదులని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం తలారి సింగిలోని ఇండోర్‌స్టేడియంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా కలెక్టర్, జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ్, పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ జ్యోతిని వెలిగించారు. గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గిరిజనుల హక్కులు, చట్టాల పరిరక్షణతో పాటు అడవిబిడ్డల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సుస్థిరత, స్థిరత్వం గిరిజనులను చూసే నేర్చుకోవాలన్నారు. ఆదివాసీల హక్కులు రక్షించాల్సిన అవసరం ఉందని, షెడ్యూల్ 5 నిబంధనలను పక్కాగా అమలు జేయాలని సూచించారు.గిరిజన హక్కుల కోసం పోరాడుతున్న నేతలంతా షెడ్యూల్ 5 ద్వారా ఉన్న హక్కులపై గిరిజనులకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఇటీవల డుంబ్రిగుడ పాఠశాలను సందర్శించినప్పుడు విద్యార్థులను ఏమవుతావని అడిగితే మాట్లాడలేక పోతున్నారని, పిల్లలకు సరైన ఆకాంక్షలు లేకపోవడం దురదృష్టకరమన్నారు. మార్గదర్శి అనే కార్యక్రమాన్ని ఈనెలలో ప్రారంభించి గిరిజన విద్యార్థులను చైతన్య పరుస్తామన్నారు. జిల్లాలో సుమారు 950 గ్రామాలకు రోడ్లు లేవని, గత కలెక్టర్ వారధి అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, రానున్న మూడేళ్లలో రోడ్లు, వంతెనల నిర్మాణాలకు చర్యలు చేపడుతామన్నారు. గిరిజనులకు మెరుగైన విద్య, వైద్య కార్యక్రమాల అమలుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలలో పనిచేసే అదృష్టం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గిరిజన విద్యార్థుల ఆలోచన విధానంలో మార్పులు రావాలన్నారు. జిల్లాలో 250 మంది స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాల పేర్లను విశాఖలోని టీసీఆర్ టీఎంలో పొందుపరిచామని, వారందరికి సామాజిక పింఛన్లు పంపిణీ జరిగేలా ప్రభుత్వానికి నివేదిస్తామని వారు తెలిపారు.అలాగే ఆదివాసీ జేఏసీ కన్వీనర్ రామారావుదొర, దండకారణ్య ఉద్యోగ సమితి ప్రతినిధి సమరెడ్డి మాణిక్యం గిరిజనుల హక్కులు, చట్టాల పరిరక్షణపై మాట్లాడారు.




బిందెలతో మహిళల థింసా నృత్యం

ఆకట్టుకున్న నృత్యప్రదర్శనలు

పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థుల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చొంపి గ్రామానికి చెందిన గిరిజన మహిళలు బిందెలతో ప్రదర్శించిన థింసా నృత్యం అలరించింది. కలెక్టర్, జేసీ, ఐటీడీఏ పీవోలు గిరిజనుల సంప్రదాయ విల్లంబులను చేతబూని సందడి చేశారు. అడ్డాకుల టోపీలను ధరించారు.అలాగే అంతర్జాతీయ కాఫీ అవార్డు గ్రహీత కిల్లో అశ్విని, ఆదర్శ కాఫీ రైతులు కూడా పోతురాజు (దొడ్డిపల్లి), కొర్రా వెంకటరావు (గుర్రగరువు), పాంగి మహేష్, వి.బొంజుబాబు (గొడ్డుమామిడి)లను కలెక్టర్ సత్కరించారు. అలాగే వీడీవీకే, ప్రకృతి వ్యవసాయం స్టాళ్లను ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పద్మావతి, ఐటీడీఏ ఏపీవోలు వీఎస్ ప్రభాకర్, ఎం .వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు, ఎస్‌డీసీ శర్మ, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా, డీఆర్‌డీఏ పీడీ మురళీ, ఆర్అండ్‌బీ ఈఈ బాలసుందరబాబు, ఐటీడీఏ ఏవో హేమలత, అరకు గిరిజన మ్యూజియం మేనేజర్ మురళి, పాడేరు ఏటీడబ్ల్యూవో ఎల్.రజిని పాల్గొన్నారు. ఇలావుండగా మండలంలోని కందమామిడి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్ పాల్గొన్నారు. గిరిజన బాలికలతో థింసా నృత్యం చేశారు.


స్వాతంత్ర్య సమరయోధులకు ఘన నివాళి

బెంగళూరులో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వేడుకలు



బెంగళూరులో ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, అరకు, పాడేరు ఎమ్మెల్యేలు మత్స్యలింగం, విశ్వేశ్వరరాజు, మాజీ ఎమ్మెల్యేలు పాల్గుణ, భాగ్యలక్ష్మి తదితరులు

సాక్షి,పాడేరు: బెంగళూరులోని వైఎస్సార్‌సీపీ శిబిరంలో శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నేతలంతా ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు, పాడేరు ఎమ్మెల్యేలు రేగం మత్స్యలింగం, మత్స్యరాస విశ్వేశ్వరరాజు, పార్టీ జిల్లా అధ్యక్షురాలు,మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు శోభా హైమావతిదేవి, చెట్టి పాల్గుణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆదివాసీలకు వారు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాడేరు, అరకులోయ నియోజకవర్గాల పరిధిలోని వైఎస్సార్‌సీపీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు గిరిజన స్వాతంత్ర్య సమర యోధులకు ఘనంగా నివాళి అర్పించారు. మహిళా ప్రజాప్రతినిధులు థింసా నృత్యాలతో సందడి చేశారు.



బెంగళూరులో థింసా నృత్యం చేస్తున్న మహిళా ప్రజాప్రతినిధులు

క్లుప్తంగా

టీడీపీ నేత భూ కబ్జా

దుంబ్రిగుడ: అధికారాన్ని అండగా పెట్టుకుని టీడీపీకి చెందిన మాజీ ఎంపీపీ దన్నేరావు ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తున్నారు. మండల కేంద్రానికి సమీపంలోని చాపరాయి జలవిహారిలోని జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గెడ్డ పోరంబోకు స్థలంపై ఆయన కన్నేశారు. ఆ స్థలాన్ని ఆక్రమించి షాపుల నిమిత్తం పిల్లర్లు నిర్మిస్తున్నారు. ప్రభుత్వ భూమి కబ్జాకు గురికాకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఆర్ఐ హరికృష్ణను వివరణ కోరగా గెడ్డ పోరంబోకు స్థలంలో మాజీ ఎంపీపీ పిల్లర్లు నిర్మించడం వాస్తవమన్నారు. కబ్జాకు గురైన స్థలాన్ని ఆధీనంలోకి తీసుకునేందుకు సిబ్బందితో వెళ్లి ఆయనను హెచ్చరించామని తెలిపారు. ఆదేశాలను బేఖాతర్ చేస్తే ఆయనపై చర్యలు నిమిత్తం జాయింట్ కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని ఆర్ఐ పేర్కొన్నారు.

'సోలార్' పోస్టర్ ఆవిష్కరణ

చింతూరు: ఆదివాసీ దినోత్సవం పురస్కరించుకుని ప్రధానమంత్రి జన్‌మన్ యోజన సోలార్ పోస్టర్‌ను చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, ఈపీడీసీఎల్ ఎస్ఈ తిలక్‌కుమార్ శుక్రవారం చింతూరులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ నాలుగు మండలాల్లోని 94 మంది కొండరెడ్డి లబ్ధిదారులకు ఒక్కొక్కరికీ సోలార్‌స్టాండు, ఐదు బల్బులు, ఫ్యాను, రెండు స్విచ్‌బోర్డులు అందించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోనే తొలిసారిగా చింతూరు ఐటీడీఏ పరిధిలో ఈ పథకం కింద సోలార్ సెట్లు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ మలాకీ, లైన్ ఇన్‌స్పెక్టర్ గణేష్ పాల్గొన్నారు.

ముమ్మరంగా తనిఖీలు



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

చింతపల్లి: చింతపల్లిలో శుక్రవారం పోలీసులు వాహనాలను ముమ్మర తనిఖీలు చేపట్టారు. స్థానిక సీఐ రమేష్ ఆదేశాల మేరకు ఆదివాసీ దినోత్సవం సందర్భంగా చింతపల్లిలో మహాసభ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ప్రతి వాహనాన్ని పోలీసు సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించారు. చింతపల్లికి నలుమూలల నుంచి వస్తున్న వాహనాలను స్థానిక డిగ్రీ కళాశాల, అంతర్ల, గురుకుల కళాశాల ప్రాంతాల్లో నిలుపుదల రికార్డులు తనిఖీ చేసి పంపించారు. అదనపు ఎస్ఐ వెంకటరమణతో పాటు సిబ్బంది తదితరులున్నారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి

జేసీ అభిషేక్ గౌడ్



సభలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, గిరిజనులు

చింతపల్లి: గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అంతా కృషి చేయాలని జేసీ అభిషేక్ గౌడ్ తెలిపారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ మైదానంలో గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. గిరిజన ప్రాంతమంటే స్వచ్ఛతకు మారుపేరన్నారు. అంతకు ముందు స్థానిక హనుమాన్ జంక్షన్‌నుంచి పాతసంతబయలు వరకు విద్యార్థులతో కలసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులు పలు నృత్యాలు ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా జేసీతో పాటు విశ్రాంత ఐఏఎస్ అధికారి బాబూరావు నాయుడు పాల్గొన్నారు. ఈసందర్భంగా జేసీని గిరిజన ఉద్యోగ సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోరాబు సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు శేషాద్రి, కార్యనిర్వాహక కార్యదర్శి యువిగిరి, సంయుక్త కార్యదర్శి మోహన్‌రావు, మండల అధ్యక్షుడు బౌడు గంగరాజు, సంఘం నాయకులు శశికుమార్, కామేష్, జిల్లా మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు వరలక్ష్మి, తహసీల్దారు రామకృష్ణ ఎంఈవోలు ప్రసాద్, బోడంనాయుడు, సంఘం నాయకులు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమమే లక్ష్యం

చింతూరు: డివిజన్‌లో నాలుగు మండలాలకు చెందిన గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య అన్నారు. శుక్రవారం చింతూరులో ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టంలో భాగంగా 4,348 కుటుంబాలకు 16,714 ఎకరాల పోడు భూములకు హక్కులు కల్పించినట్టు చెప్పారు. వైద్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, దీనిలో భాగంగా చింతూరు ఏరియా ఆస్పత్రిలో పలు సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చామన్నారు. చింతూరు డివిజన్‌లో ఈ ఏడాది పదో తరగతి ఫలితాలను 12 శాతం నుంచి 92 శాతానికి పెంచేందుకు కృషి చేశామని తెలిపారు. గర్భిణులు, తల్లులు, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్టు చెప్పారు. జల్‌జీవన్ మిషన్ కింద రూ 48.74 కోట్లతో కుళాయిలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా 61,649 మంది లబ్ధిదారులకు 31,679 జాబ్‌కార్డులు అందచేశామని, రైతుభరోసా పథకం కింద 5,485 మంది రైతులకు 4,310 క్వింటాళ్ల వరి విత్తనాలు పంపిణీ చేశామని పీవో తెలిపారు. ఈ సందర్భంగా చింతూరు మెయిన్‌రోడ్ సెంటర్లో ఆదివాసీ జెండాను ఎగురవేసి, ఆదివాసీ అమర వీరుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చింతూరు ఏఎస్పీ రాహుల్ మీనా, డీఎఫ్‌వో బబిత, జెడ్పీటీసీ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

హక్కులను పరిరక్షించుకోవాలి

రాజవొమ్మంగి : ఆదివాసీలకు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులను పరిరక్షించుకోవాలని రంపచోడవరం అడిషినల్ సూపరింటెండెంట్ (ఏఎస్పీ) జగదీష్ అడహాళి అన్నారు. ఆదివాసీల పిల్లలు రానున్న రోజుల్లో విద్యలో రాణించి, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మండలంలోని దాకరాయి శివారు కోదు సామాజిక వర్గం ఆదివాసీలతో వేడుకలో పాల్గొన్నారు. పిల్లలకు పుస్తకాలు, పెన్నులు, బిస్కట్లు, స్వీట్లు, పెద్దలకు దుప్పట్లను స్వయంగా అందజేశారు. స్థానిక సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐలు వెంకయ్య, రఘునాథరావు, సిబ్బంది పాల్గొన్నారు.



దాకరాయిలో ఆదివాసీ చిన్నారులకు బహుమతులను అందజేస్తున్న ఏఎస్పీ జగదీష్ అడహాళి



చింతూరులో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేస్తున్న ఐటీడీఏ పీవో కావూరి చైతన్య



ఆదివాసీ దినోత్సవం సందర్భంగా చింతపల్లిలో గిరిజన సంఘాల ర్యాలీ

రైతులకు సూచనలు

చింతపల్లి: రైతులు వరి పంటలో చీడపీడలపై అప్రమత్తంగా ఉండి నివారణ చర్యలు చేపడితే మంచి దిగుబడి సాధించడానికి ఎంతో అవకాశం ఉందని వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని గడపరాయి, పెద్దబడడం గ్రామాల్లో శుక్రవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు తెగుళ్ల నివారణకు పలు సూచనలిచ్చారు. ఇందులో భాగంగా వరి ఆకు చివర్లు తుంచి నాటడం ద్వారా వరిలో పీకపురుగును నివారించవచ్చని, కాలి బాటలు ద్వారా దోమ ఉధృతి నివారించవచ్చన్నారు. వరి నారు నాట్లుకు ముందుగా బీజామృతం, సూడో మోనాస్‌తో శుద్ధి చేసే ప్రక్రియపై అవగాహన కల్పించారు. తరువాత గ్రామంలో ఈ పంట నమోదు పరిశీలించారు. వీహెచ్‌ఏ చంద్రకళ, ప్రకృతి వ్యవసాయ విభాగ యూనిట్ ఇన్‌చార్జి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: గిరిజన రైతులు వరిసాగులో శాస్త్రీయ విధానాలను ఆచరించాలని గిరిజన వికాస్ మాతోట ప్రతినిధులు రమ్య, పోతురాజు కోరారు. మంగళపాలెంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు సేంద్రియ సాగుపై అవగాహన కల్పించారు. వీహెచ్‌ఏ మహేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

అనకాపల్లి : తన భార్య కనిపించడం లేదని పట్టణ పోలీసులకు శుక్రవారం ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు. దీనిపై ఏఎస్ఐ ఆర్.లత తెలిపిన వివరాలివి. కోటవురట్ల మండలం అన్నవరం గ్రామానికి చెందిన గోవింద్, భార్య అనంతలక్ష్మి, ఇద్దరు పిల్లలు కుటుంబ సమేతంగా కొంతకాలంగా అనకాపల్లి నర్సింగరావుపేట గ్రామంలో నివసిస్తున్నారు. గోవింద్ వృత్తిరీత్యా తాపీమేస్త్రిగా పనిచేస్తున్నాడు. గత నెల 24వ తేదీన అనంతలక్ష్మి అలిగి ఇద్దరు పిల్లలను ఇంట్లో వదిలి ఇంటి నుంచి వెళ్లిపోయిందని, గోవింద్ చుట్టుపక్కల, బంధువుల ఇంట్లో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఏఎస్ఐ తెలిపారు.

పెదలోచలి ఆశ్రమ హెచ్‌ఎం సస్పెన్షన్

- ఏడుగురు టీచర్లకు షోకాజ్ నోటీసులు
- విధులపట్ల నిర్లక్ష్యంపై పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ చర్యలు

జి.మాడుగుల: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ సస్పెండ్ చేశారు. మరో ఏడుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులను జారీ చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఏజెన్సీలో భారీ వర్షాలు కురుస్తున్నందున ఆశ్రమ పాఠశాలల నుంచి విద్యార్థులను బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఉన్నతాధికారుల నుంచి హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో మండలంలోని పెదలోచలి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను గత నెల 26న పాడేరు ఐటీడీఏఈ పీవో అభిషేక్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సమయంలో వంద మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు గుర్తించారు. వర్షాల కారణంగా విద్యార్థులను బయటకు పంపవద్దని ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఎందుకు అమలు చేయలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి. ధర్మేంద్రను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అదే పాఠశాలలో పనిచేస్తున్న ఏడుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఉపాధ్యాయులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గంజాయి కేసులో ఐదేళ్ల తర్వాత చిక్కిన నిందితులు

సీతమ్మధార : గంజాయి కేసులో ఐదేళ్లగా పోలీసుల కళ్లుకప్పి తప్పించుకు తిరుగుతున్న ముగ్గురు నిందితులను ద్వారకా పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన చిలుకూరి సాయి నిఖిల్, అనకాపల్లి జిల్లా నక్కపల్లికి చెందిన వంగలపూడి వెంకట సాయి, సిమ్లిగూడకు చెందిన గొల్లోరి సాయి 2019లో గంజాయి అక్రమ రవాణా చేసినట్లు ద్వారకా స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి నుంచి వారు పోలీసులను తప్పించుకుని తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు వారిని శుక్రవారం అరెస్ట్ చేశారు. కోర్టులో హాజరు పరచగా.. రిమాండ్ విధించారని సీఐ రమేష్ తెలిపారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

జి.మాడుగుల: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా వివిధ మండలాల్లో శుక్రవారం ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. జి.మాడుగుల సింగర్భ పంచాయతీ గొడ్డుబూసులు గ్రామంలో ఏపీవో కొండబాబు ఆధ్వర్యంలో ఎంపీడీవో లోహిత్ జయ సాగర్ తదితరులు మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 35,000 సిల్వర్‌ఓక్ మొక్కలు నాటారు.

కొయ్యూరు: మండలంలో 33 పంచాయతీల్లో 50 ఎకరాల్లో 32వేల 800 మొక్కలు నాటామని ఎంపీడీవో లాలం సీతయ్య తెలిపారు. ముందుగానే మొక్కలను పంపిణీ చేశామన్నారు. ఏపీవో శ్రీనివాస్, వీఆర్‌పీలు పాల్గొన్నారు

పెదబయలు: మండల వ్యాప్తంగా 9100 సిల్వర్ ఓక్, జీడిమామిడి, నిమ్మ మొక్కలు నాటినట్టు ఏపీవో ఎస్.చిన్న అప్పలనాయుడు చెప్పారు. రైతులు ప్లాంటేషన్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ మొక్కను రక్షించుకోవాలన్నారు. ప్లాంటేషన్ సూపర్ వైజర్ సింహాచలం, సాంకేతిక సహాయకులు కృష్ణకుమారి, మహేష్, క్షేత్ర సహాయకులు సన్యాసమ్మ,బాస్కర్‌రావు పాల్గొన్నారు.



గొడ్డబూసులులో మొక్కలు నాటుతున్న ఏపీవో కొండబాబు

గూడెంకొత్తవీధి: మండలంలో 80 ఎకరాల్లో 56000 సిల్వర్ ఓక్ మొక్కల పెంపకం కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఉపాధి పథకం ఏపీడీ లోకేష్‌కుమార్ తెలిపారు. ఉద్యాన అధికారి రాంప్రసాద్‌తో కలసి ఆయన శుక్రవారం మండలంలోని చినజడుమూరులో సిల్వర్ ఓక్ మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఫీల్డ్ అసిస్టెంట్లు విష్ణుప్రసాద్, బాలరాజు పాల్గొన్నారు.



సీతగుంటలో ప్లాంటేషన్ పనులను పరిశీలిస్తున్న ఏపీవో, ఉపాధి సిబ్బంది



కొయ్యూరులో మొక్కలు నాటుతున్న ఏపీవో, సిబ్బంది



జీకే వీధిలో సిల్వర్ ఓక్ మొక్కలను నాటుతున్న ఏపీడీ లోకేష్, పీఎస్ఓ రాంప్రసాద్

12 మద్యం సీసాలు తరలిస్తున్న వ్యక్తిపై కేసు

అనకాపల్లి : మద్యం క్వార్టర్ బ్యాటిల్స్ తరలిస్తున్న మండలంలో కోడూరు గ్రామానికి చెందిన సేనాపతి రమణ వద్ద నుంచి 12 క్వార్టర్ బ్యాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ ఏఎస్ఐ ఆర్.లత శుక్రవారం చెప్పారు. ఏఎస్ఐ కథనం మేరకు వివరాలు...పట్టణంలో డీ మార్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనకాపల్లి నుంచి కోడూరు ద్విచక్ర వాహనంపై వెళ్లుతున్న రమణ వద్ద నుంచి 12 బాటిల్స్ స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ చెప్పారు.

కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ఆలస్యం

తాటిచెట్లపాలెం: ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-షాలిమర్ (12842) కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ సుమారు 15.30 గంటలు ఆలస్యంగా శుక్రవారం రాత్రి 10.30 గంటలకు చెన్నై సెంట్రల్‌లో బయలుదేరింది. పెయిరింగ్ రైలు ఆలస్యం కారణంగా ఎంజీఆర్ చెన్నై సెంట్రల్‌లో ఈ రైలును రీ షెడ్యూల్ చేశారు. అంతే ఆలస్యంగా ఈ రైలు ఆయా స్టేషన్లకు చేరుకుంటుంది. ఈ రైలు శుక్రవారం రాత్రి 7.50 గంటలకు విశాఖపట్నం చేరుకోవాల్సి ఉండగా.. శనివారం ఉదయం 10.30 గంటలకు చేరుకోవచ్చని రైల్వే అధికారులు తెలిపారు.

విశాఖ-బెంగళూరు స్పెషల్ రైలు పునరుద్ధరణ

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం-బెంగళూరు మధ్య గతంలో నడిచిన స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌ను పునరుద్ధరిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ప్రతీ ఆదివారం విశాఖపట్నంలో బయలుదేరే విశాఖపట్నం-బెంగళూరు(08543) స్పెషల్ ఈ నెల 18 నుంచి, ప్రతీ సోమవారం బెంగళూరులో బయలుదేరే బెంగళూరు-విశాఖపట్నం (08544) స్పెషల్ ఈ నెల 19 నుంచి మళ్లీ పట్టాలెక్కనుంది.

తాండవ నల్లకొండమ్మ తల్లి ఆలయంలో చోరీ



చోరీ జరిగిన అమ్మవారి ఆలయం

నాతవరం : తాండవ రిజర్వాయర్ గట్టు దిగువనున్న నల్లకొండమ్మ తల్లి ఆలయంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీని దొంగిలించారు. ఆలయంలో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ వాటిలో రికార్డు కాకుండా ఆలయంలో హుండీని ఎత్తుకుపోయి దాంట్లో నగదు, వస్తువులను దోచుకుని హుండీని ఆలయ సమీపంలో తుప్పల్లో పడేశారు. శ్రావణ శుక్రవారం ఉదయం భక్తులు ఆలయ కమిటీ సభ్యులు ఆలయానికి వెళ్లగా ఈ విషయం తెలిసింది. వెంటనే ఆలయ కమిటీ సభ్యులు గ్రామపెద్దలు నాతవరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. అదే విధంగా నాతవరం గ్రామంలో గల రిలయన్స్ టవర్ వద్ద ఏర్పాటు చేసిన బ్యాటరీలు, ఇతర సామాగ్రిని గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని వైఎస్సార్‌సీపీ మహిళా సమాఖ్య మండల శాఖ అధ్యక్షురాలు పాలుపర్తి రాధ తెలిపారు. ఈ విషయంపై రిలయన్స్ కంపెనీ యాజయాన్యానికి కూడా ఫిర్యాదు చేశామన్నారు. గతంలో ఎప్పుడూ సెల్ టవర్ వద్ద దొంగతనాలు జరగలేదని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

కూనవరం: పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ డి. తులసీ అన్నారు. జ్వరాల తీవ్రత ఉన్న టేకులద్ది గ్రామాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. జ్వరాలు, మలేరియా రావడానికి గల కారణాలను తెలుసుకున్నారు. యాంటీ లార్వా మందును పిచికారి చేయాలని సూచించారు. మలేరియా సోకిన వారితో నేరుగా మాట్లాడారు. అనంతరం కూటూరు పీహెచ్‌సీని సందర్శించి రికార్డులు పరిశీలించారు. తదుపరి మలేరియా ప్రభావిత గ్రామాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి శ్రీనివాసరాజు, కూటూరు డాక్టర్ శ్రీనివాసమూర్తి దొర, సూపర్ వైజర్ డి.శ్రీనివాస్, సీతమ్మ, ఎంటీ రాజేష్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



టేకులద్దిలో మలేరియా పాజిటివ్ కేసులపై ఆరా తీస్తున్న డీఎంవో డాక్టర్ తులసి

రక్తదాతలుగా మారండి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్



చింతపల్లిలో రక్తదానం చేస్తున్న యువకులు

- కలెక్టర్ దినేష్‌కుమార్ పిలుపు

పాడేరు : ప్రతిఒక్కరు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కలెక్టర్ దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఐటీడీఏ పీవో అభిషేక్ ప్రారంభించారు.

జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ సహా ఐటీడీఏ ఉద్యోగులు. పోలీస్ శాఖ, అగ్నిమాపక శాఖ. ఆర్టీసీ ఉద్యోగులతో పాటు పలువురు ప్రభుత్వ ఉద్యోగులు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు. చింతపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 25 మంది ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, డీసీహెచ్ కృష్ణారావు, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు లోహితాస్, పల్టాసింగి సూర్యారావు, జయలక్ష్మి, గౌరీశంకర్ పాల్గొన్నారు.

50 యూనిట్ల రక్తం సేకరణ

చింతపల్లి: రక్తదానం ప్రాణదానంతో సమానమని చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖరరావు అన్నారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో శుక్రవారం చింతపల్లిలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 50 యూనిట్ల రక్తాన్ని దాతలనుంచి సేకరించామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.